క్లుప్తంగా

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై శిక్షణ



దుర్గాడలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఓ సత్యనారాయణ

గొల్లప్రోలు: మండలంలోని దుర్గాడ రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రైతులను సాగుకు సన్నద్ధం చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ, సాగు పద్ధతులు, వరి రకాలు, పత్తి, మొక్కజొన్న, అపరాల పంటలపై అవగాహన కల్పించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా కేంద్రాల వారీగా సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించినట్టు తెలిపారు.

లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి అమ్మవారు

గొల్లప్రోలు: పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లలితా సహస్రనామ కుంకమార్చన నిర్వహించారు. రాత్రికి ప్రదోష కాల సమయంలో అమ్మవారిని ఆరుబయట చంద్రుడి ఎదురుగా ఉంచి సౌభాగ్య మహిళలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి జాతర



కొత్తపల్లి: గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. జాతరలో గరగ నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

లక్ష్మణరావు కుటుంబాన్ని ఆదుకుంటాం



లక్ష్మణరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన లక్ష్మణరావు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడే సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటరాయపురం గామానికి చెందిన శీలం లక్ష్మణరావు ఇటీవల తాటిచెట్టుపై నుంచి జారి పడి మృతి చెందాడు. అతని కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాగా మృతుడి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఫోన్‌లో పరామర్శించారు. కార్యక్రమంలో నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటిలో సర్కారు సేవలు

- ఐదేళ్లలో పెరిగిన ప్రభుత్వ భవనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

పెద్దాపురం: పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు. అటువంటి పల్లె సీమల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగింది. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు గ్రామాల్లోనే సుపరిపాలన అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వ్యవస్థే సచివాలయ వ్యవస్థ. ప్రజలకు పాలన అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో 'సచివాలయాల' పరిధిలోనే రైతుల కోసం 'రైతు భరోసా కేంద్రాలు', ప్రజారోగ్యం కోసం 'వెల్ నెస్' సెంటర్లు, పాడి రైతుల కోసం 'బల్క్‌మిల్క్' సెంటర్లు, విజ్ఞాన సముపార్జనకై 'డిజిటల్ లైబ్రేరీలు' ఏర్పాటు చేసి ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ ఆస్తులను పెంచింది. వీటికి గ్రామాల్లో భవన నిర్మాణాలకు కోట్లాది రూపాయలు మంజూరు చేసింది. నియోజకవర్గంలో 39 గ్రామ పంచాయతీల్లోని 43 సచివాలయాలు, 43 ఆర్బీకేలు, 43 వెల్‌నెస్ సెంటర్లు, 43 బల్క్‌మిల్క్ సెంటర్లు, మూడు డిజిటల్ లైబ్రేరీలకు భవనాలు నిర్మించి సుమారు రూ. 40 కోట్లకు పైగా ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం వెచ్చించింది. నియోజకవర్గంలోని కొన్ని సచివాలయాలకు భవనాలు ఉన్నా పూర్తి స్థాయిలో వసతులు లేవు. సచివాలయ వ్యవస్థకు అనుగుణంగా వసతులు కల్పించేలా నిర్మాణాలు చేపట్టి ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, ఆర్బీకేకు రూ.21.80 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ.17.5 లక్షలు, డిజిటల్ లైబ్రేరీకి రూ.16 లక్షలు, బల్క్‌మిల్క్ సెంటరుకు రూ.15.74 లక్షల వంతున నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే మండలంలోని కట్టమూరు, తాటిపర్తి, కాండ్రకోట, గుడివాడ, జి.రాగంపేట గ్రామాల్లోని సచివాలయ భవనాలు పూర్తికాగా, మండలంలోని గుడివాడ-సిరివాడ రైతు భరోసా కేంద్రాన్ని జిల్లాలో తొలిసారి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు, ఎంపీ వంగా ప్రారంభించారు. మిగిలిన గ్రామాల్లో సచివాలయం, ఆర్బీకేలకు భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి.



నూతన హంగులతో నిర్మితమైన తాటిపర్తి ఆరోగ్య భవనం



జిల్లాలో తొలిసారి ప్రారంభించిన గుడివాడ-సిరివాడ ఆర్బీకే



తాటిపర్తిలో ప్రారంభమైన సచివాలయ భవనం

సెగ్మెంట్‌లో మంజూరైన నిధులు ఇలా...

సంఖ్య	మంజూరైన భవనాలు		మంజూరైన నిధులు
1.	గ్రామ సచివాలయాలు	- 43	రూ. 17.20 కోట్లు
2.	రైతు భరోసా కేంద్రాలు	- 43	రూ. 9.33 కోట్లు
3.	ఆరోగ్య కేంద్రాలు	- 43	రూ. 6.86 కోట్లు
4.	బల్క్‌మిల్క్ కేంద్రాలు	- 43	రూ. 6.74 కోట్లు
5.	డిజిటల్ లైబ్రేరీలు	- 3	రూ. 0.48 కోట్లు
	మొత్తం భవనాలు	-175	రూ. 40.61 కోట్లు

అన్ని వర్గాల ప్రజలకు మేలు



సచివాలయాలకు భవనాలు నిర్మించడం, రైతులకు, పాడి రైతులకు, ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక భవనాలు నిర్మించడమే కాకుండా వసతులు కల్పించడం హర్షణీయం. అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా అన్ని రకాల సేవలు ఒకే చోట అందే వీలుంటుంది. సచివాలయ వ్యవస్థను మేము స్వాగతిస్తున్నాం.

– గోపు మురళి, ఉప సర్పంచ్, తాటిపర్తి, పెద్దాపురం మండలం

నిర్మాణాలు వేగంగా పూర్తి చేస్తాం



సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ సెంటర్ల భవనాల నిర్మాణాలు నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల పర్యవేక్షణలో గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భవనాల నిర్మాణానికి ఉన్న ఆటంకాలు తొలగించేందుకు కృషి చేస్తాం.

– జి.ఉషారాణి, ఎంపీడీఓ, పెద్దాపురం

పొలంలో మట్టి తవ్వకాలపై వివాదం



తహసీల్దారు కార్యాలయంలో ఇరు వర్గాలతో చర్చిస్తున్న తహసీల్దార్ సుందరరాజు

కొత్తపల్లి: పంట పొలాల్లో మట్టి తవ్వకాలపై బుధవారం వివాదం చోటు చేసుకుంది. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని నాగులపల్లిలో పంట పొలాలను మెరక, పల్లాలు చేసుకునేందుకు రైతులు ట్రాక్టర్లతో మట్టిని తరలించుకుంటున్నారు. సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన కొంత మంది సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి మైనింగ్ శాఖ నుంచి వచ్చామని, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.316 చెల్లించాలని, లేకపోతే ట్రాక్టర్‌లను సీజ్ చేస్తామంటూ బెదిరించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్ యజమానులు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇరువురితో తహసీల్దారు సుందరరాజు చర్చించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న 11మంది ట్రాక్టర్ యజమానులపై, మైనింగ్ అధికారులమంటూ బెదిరింపులకు దిగిన పి.రాజు, జె.రాఘవేంద్ర, బి.అప్పారావు, ఎంపీపీ రావులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో శ్యామలాంబ జాతర



సీతారామ దండు నృత్య ప్రదర్శన



జాతరలో దేవతామూర్తుల సాంస్కృతిక ప్రదర్శనలు

సామర్లకోట: మండల పరిధిలో అచ్చంపేట గ్రామంలో శ్యామలాంబ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరిగింది. శ్యామలాంబ అమ్మవారు అచ్చంపేట సమీపంలోని గొంచాల గ్రామంలో వెలయడంతో ఆ గ్రామానికి చెందిన భూస్వామి బండే మంగాయ్యమ్మ ఆలయ నిర్వాహణకు సుమారు 11 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. దాంతో గొంచాల గ్రామంలో 80 ఏళ్ల క్రితం అమ్మవారి ఆలయాన్ని నిర్మించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 30 ఏళ్ల క్రితం ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గొంచాల గ్రామంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. సుమారు 25 ఏళ్ల నుంచి ఆలయ భూములు తమ గ్రామానికి చెందిన దాత ఇవ్వడంతో తమ గ్రామంలో ఉత్సవాలు నిర్వహించేలా చూడాలని గ్రామస్తులు పట్టుపట్టారు. దానికి దేవదాయ శాఖ అంగీకరించక పోవడంతో గ్రామస్తుల సహకారంతో 2003లో అమ్మవారి ఆలయాన్ని నిర్మించి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం రాత్రి బాణసంచా కాల్పులు గరగల నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఆలయ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు. గురువారం ఉదయం నుంచి ఆలయం వద్ద తిరునాళ్లు జరుగుతాయి. అయితే గొంచాల గ్రామంలో ఉత్సవాలు నిర్వహించడానికి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని దేవదాయశాఖ అధికారులు చెప్పడంతో జాతర ఉత్సవాలు నిర్వహించకుండా అమ్మవారికి పూజలు, దర్శనాలు నిర్వహించనున్నట్టు గ్రామ సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ తెలిపారు. శ్యామలాంబ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గొంచాల, అచ్చంపేట గ్రామాల్లో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు పెట్టారు.



అచ్చంపేట గ్రామంలోని శ్యామలాంబ అమ్మవారు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో శ్రీనివాసరావు

- నియోజకవర్గ ఈఆర్వో శ్రీనివాసరావు
- ప్రత్తిపాడులో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు (ఓట్ల లెక్కింపు) పకడ్బందిగా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జేఎన్‌టీయూకే అంబేడ్కర్ లైబ్రేరీ భవనం 3వ అంతస్తులో ప్రత్తిపాడు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. శాసనసభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశామని, 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌కు మూడు టేబుళ్లు, సర్వీసు ఓట్ల లెక్కింపునకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి ఫారాలను తామే అందజేస్తామన్నారు. ఒక్కో అభ్యర్థికి 14 టేబుళ్లకు గాను 14 మంది ఏజెంట్లను అనుమతిస్తామని చెప్పారు. జూన్ 4న ఉదయం 7 గంటలకే ఏజెంట్లు కౌంటింగ్ హాలుకు చేరుకోవాలని, 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు నేర చరిత్ర, పోలీస్ కేసులు ఉండరాదన్నారు. కౌంటింగ్ హాలులోకి తామిచ్చే కౌంటింగ్ ఏజెంట్ గుర్తింపు కార్డు మినహా పెన్నులు గాని, సెల్ ఫోన్లు గాని, మరే ఇతర కాగితాలు అనుమతించేది లేదన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహరించారన్నారు. అలాగే కౌంటింగ్‌కు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్. నరసింహరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోటకూర వీరబాబు, బాబ్జీ, ధరణాలకోట శ్రీను (కాంగ్రెస్), కొండపల్లి శ్రీను (టీడీపీ), బీఎస్పీ, జైభీంరావ్ భారత్ పార్టీ అభ్యర్థులు భూర్తి శ్రీనుబాబు, దాడిశెట్టి వీరబాబు పాల్గొన్నారు.

పూల అందమే వేరు



ఏలేశ్వరంలో అలరిస్తున్న మే పుష్పాలు

ఏలేశ్వరం: ప్రత్యేకంగా ఈ నెలలో మాత్రమే పూసే మే పుష్పాలు పట్టణంలో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. స్థానిక సాయిబాబా మెట్టపై శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో వీటిని ఆలయ పూజారి అయిలూరి సుబ్రహ్మణ్యం పెంచారు. ఇవి చాలా అరుదుగా మే నెలలో మాత్రమే పూస్తాయి. వీటిని ఫుట్బాల్, బ్లడ్‌లిల్లీ పేర్లతోనూ పిలుస్తారు. వీటిని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విశ్రాంత ఉపాధ్యాయుడు వీరభద్రరావు, విద్యార్థులను సత్కరించిన ట్రస్ట్ సభ్యులు

కొత్తపల్లి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా పయనించాలని మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొర్ల పెద్దిరాజు అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లిలో గొర్ల వెంకటరావు, మంగయమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ గొర్ల పెద్దిరాజు, సునీత దంపతులు 10వ, 7వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. అనంతరం పిఠాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వరద వీరభద్రరావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా గత 19 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.సుబ్బారావు, కేవీఎస్ ప్రసాద్, మూలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



గొల్లప్రోలు మండలంలో ఖరీఫ్ సాగుకు దుక్కు చేసిన పొలం

గొల్లప్రోలు: అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో ఇటీవల వర్షాలు పడటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు వేసవి దుక్కులు చేస్తున్నారు. కొందరు రైతులు పత్తి నాట్లు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఖరీఫ్‌లో రైతులను ఆకట్టుకునేందుకు పలు విత్తనాల కంపెనీలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాయి. అన్నదాతలు అప్రమత్తంగా లేకుంటే నకిలీ విత్తనాలతో నష్టపోయే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో కొందరు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లో ప్రచార రథాలు, గోడలపై పోస్టర్లు వేయడంతో పాటు తమ కంపెనీ విత్తనాలు కొనండి.. అధిక దిగుబడి పొందండి అంటూ ప్రచారం చేస్తున్నారు. వీరి మాటలు నమ్మితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో నకిలీ పత్తి విత్తనాలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారి అధికారులు నకిలీ విత్తనాలపై కొరడా ఝుళిపించాలని అన్నదాతలు కోరుతున్నారు.

వీరభద్రరావు సేవలు అభినందనీయం



కొర్లమండ వీరభద్రరావు దంపతులను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తులూరి వీర్రాజు అన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో వైస్ చైర్మన్‌గా హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా బుధవారం లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యునిగా అనేక సేవలు చేస్తూ ప్రజలకు వీరభద్రరావు చేరువయ్యారని తెలిపారు. ఆయన విజయం వెనుక ఆయన భార్య శ్రీవాణి కృషి ఎంతో ఉందన్నారు. రాబోయే లయన్స్ క్లబ్ కమిటీకి శ్రీవాణిని అధ్యక్షురాలిగా ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సేపెని సురేష్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, లయన్స్ క్లబ్ కోశాధికారి బడుగు బాబి, మున్సిపల్ ఎంప్లాయిస్ సంఘ గిడుతూరి శ్రీనివాసు తదితరులు వీరభద్రరావు దంపతులను సత్కరించారు.

అలరించిన జానపద కళాప్రదర్శనలు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం నిర్వహించిన సత్యదేవుని రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ రథోత్సవంలో జానపద కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కోలాటం, కాళికాదేవి రూపాలతో చేసిన నృత్యాలు, కేరళ వాయిద్యాలతో నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రథం శిల్పికి సత్కారం

సత్యదేవునికి 18 అడుగుల చిన్న రథం, 36 అడుగుల పెద్ద రథం నిర్మించిన శిల్పి కొల్లాటి కామేశ్వరరావును దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ ఘనంగా సత్కరించారు. ఆయనను పూల మాల, శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. కామేశ్వరరావు కుమారుడు శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు



రథోత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన భక్తులు



ఆకట్టుకున్న జానపద కళాప్రదర్శనలు



రథం నిర్మించిన కామేశ్వరరావును సత్కరిస్తున్న చైర్మన్ , ఈఓలు

కౌంటింగ్ సెంటర్ పరిశీలన



ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జేసీ రామసుందర్‌రెడ్డి, ఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: జేఎన్టీయూకే ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుతో కలిసి కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌంటింగ్ సందర్భంగా విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అక్కడి అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని ఆర్వో చెప్పారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లతో పాటు నిరంతర పర్యవేక్షణకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామన్నారు. స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణమంతా సీసీ కెమెరా నిఘా కూడా ఏర్పాటు చేశామన్నారు. వీరి వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.